International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.3, Issue-2(4), February, 2016
Impact Factor: 3.075; Email: drtvramana@yahoo.co.in

# చందమామ పత్రిక - వైశిష్ట్యం

డా.ఎమ్.గిరిబాబు,
తెలుగు విభాగం,
జ్ఞానభారతి క్యాంపస్,
బెంగళూరు విశ్వవిద్యాలయం,
బెంగళూరు.

గత 68 సంవత్సరాలుగా స్త్రీ పురుష వయో బేధం లేకుండా భారతదేశంలోని అలరించిన, అలరిస్తూ ఉన్న ఏకైక మాసపత్రిక చందమామ. భారతదేశంలో చందమామ పత్రిక పేరు విననివారు ఉండరని చెప్పడం అతిశయోక్తి కాదు. ఈ ప్రతిక వ్యవస్థాపకులు చక్రపాణి, నాగిరెడ్డి గార్లు. ఈ పత్రిక 1947 జూలై నెలలో తెలుగు, తమిళ భాషల్లో ప్రారంభమై అనతి కాలంలోనే 12 భారతీయ భాషలతోపాటు అంతర్జాతీయ భాష అయిన ఆంగ్లంలో కూడా ప్రచురించబడింది. ఈ ప్రతికలో పౌరాణిక, చారిత్రక, అద్భుత, సాంఘిక ఇతివృత్తాలతో కూడిన భిన్నమైన కథలు ప్రచురింపబడడం వల్ల ఆకర్షణీయమైన రంగురంగుల బొమ్మలతో కూడిన పత్రిక చూడ ముచ్చటగా ఉండడం వల్ల ఇది ప్రారంభించినప్పటి నుంచి భారతీయుల చేత అపూర్వంగా ఆదరింపబడుతున్నది. ఈ ప్రతికలో చిన్న కథలు, పెద్ద కథలు, ధారావాహిక కథలు, గేయ కథలు మొదలైన అనేక కథలు ప్రజలకు ఆనందాన్ని కలిగిస్తూన్నాయి. అంతే కాకుండా ఈ పత్రికలో అనేక విజ్ఞానాంశాలు, వినోదాంశాలు కూడా చోటు చేసుకున్నాయి. సాధారణంగా ఒక సంచిక తరువాత మరొక సంచిక వస్తే మొదటి సంచిక చిత్తు కాగితాల్లో కలిసిపోతుంది. కాని చందమామ పత్రిక ఎంత పాత సంచికైనా చిత్తుకాగితాలలో కలిసిపోదు. చాలా మంది వ్యక్తులు, గ్రంథాలయాలు చందమామ పత్రికలను బైడింగ్‌చేయించి భద్రపరుచుకొని చదువుకుంటూ ఆనందిస్తున్నారు. దీనికి కారణం ఈ ప్రతికలో ప్రచురింపబడిన రామాయణ, భారత, భాగవత మొదలైన వాటికి సంబంధించిన కథలతో పాటు జాతకకథల, బేతాళకథలు, అద్భుతకథలు, తెలివితేటలకు సంబంధించిన కథలు, ప్రత్యుపకారకథలు, కవుల కథలు, ప్రవక్తలకథలు, నీతి కథలు, న్యాయనిర్ణయకథలు, ప్రాణికథలు మొదలైన అనేక కథలు ప్రచురింపబడడం. ఇంతగా భారతదేశంలో ప్రజలందరికీ అభిమాన పాత్రమైన పత్రిక చందమామ తప్ప మరొకటి లేదు.

ఆధునిక కాలంలోని మానవ జీవితంలో పత్రికల అవసరం చాలా ఉంది. పత్రికలు లేకుండా మానవ జీవనం సంపూర్ణం కాదు. కూడు, గుడ్డ, ఇంటితో పాటు పత్రికా పఠనం ఈనాడు అత్యవసరమైనది పరిగింపబడుతూ వుంది. మానవ జీవతంలో ఇంతటి ప్రాధాన్యతని సంతరించుకున్న పత్రికారచన భారతదేశంలో ఆంగ్లేయుల పరిపాలన వల్ల వారి ప్రోద్భలంతో పత్రికల స్థాపన జరిగిందని చెప్పవచ్చు. ఐరోపా దేశాలతో పోలిస్తే భారతదేశంలో పత్రికలు ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ ప్రారంభించిన తరువాత అచిర కాలంలోనే ఈ రంగం చాలా వైవిధ్యభరితంగా వికసించింది. ఆధునిక కాలంలో అనేక రకాల పత్రికలు ప్రజలకు అనేక రకాల సేవలను అందిస్తున్నాయి. పత్రికలు దిన, వార, పక్ష, మాస, ద్విమాస, త్రైమాసిక పత్రికలు వస్తున్నాయి. వీటితో పాటు కొన్ని ప్రత్యేక పత్రికలు కూడా ఈనాడు వస్తున్నాయి, ఈ ప్రత్యేక పత్రికలు అందరి కోసం కాకుండా కొంత మంది ప్రత్యేకమైన పాఠకులను దృష్టిలో పెట్టుకొని ప్రచురింపబడుతున్నాయి.

**International Journal of Academic Research**
**ISSN: 2348-7666; Vol.3, Issue-2(4), February, 2016**
**Impact Factor: 3.075; Email: drtvramana@yahoo.co.in**

ఈ పత్రికలు విషయ సేకరణ మొదలుకొని పత్రిక ప్రచురణ వరకు అన్ని విషయాల్లోనూ కొంత ప్రత్యేకత సంతరించుకుంటాయి. ఇలాంటి పత్రికలు అనేక రకాల ధారావాహిక కథలు, కథలు, కార్టూన్స్, మంచి మంచి ఫ్యూచర్లు, అందం, ఆరోగ్యం మొదలైన వాటికి అవసరమైన చిట్కాలు, వంటావార్పులు, సినిమా విశేషాలతో పాటు ఇంకా వైజ్ఞానిక విషయాలను. ఇలా ఒకటని కాకుండా ఎన్నో రకాల సమాచారాన్ని పాఠకులకు అందిస్తున్నాయి. ఇవి పాఠకులకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగించడంతో పాటు విజ్ఞానాన్ని కూడా అందిస్తుంటాయి. ఇలాంటి వాటిలో మహిళా పత్రికలు, పిల్లల పత్రికలు, సినిమా పత్రికలు మొదలైనవి చెప్పుకోదగినవి. ఇలాంటి పత్రికలు పక్ష పత్రికలు, మాస పత్రికలుగా, ద్విమాస, త్రైమాస పత్రికలుగా వెలువడుతూ ఉంటాయి. ఇవన్నీ పుస్తకరూపంలో చూడగానే ఆకట్టుకునే రంగు రంగుల ముఖచిత్రంలో ఉంటాయి. నేడు వీటిని మ్యాగజైన్స్ అని పిలుస్తున్నారు. ఈ పత్రికల నిర్వహణకు, ప్రచురణకు ప్రత్యేకమైన నైపుణ్యం ఉండాలి. ప్రత్యేకమైన శైలి ఉండాలి. పాఠకుల అభిరుచిని బట్టి తదనుగుణంగా ఆ పత్రికలోని విషయాలు చెప్పబడాలి.

**పిల్లల పత్రికలు:-**

ప్రత్యేక పత్రికల్లో పిల్లల పత్రికలకు ఒక విశిష్టమైన స్థానం ఉంది. ఏ దేశంలోనైనా పిల్లల జనాభా చెప్పుకోదగిన నిష్పత్తితో ఉంటుంది. నేటి బాలలు రేపటి పౌరులు కాబట్టి ఉత్తమ పౌరులుగా బాలలను తీర్చిదిద్దాలంటే పిల్లలకు మానసిక ఉల్లాసాన్ని, వినోదాన్ని, పెంపొందింప చేయాలి. ఇలా పెంపొందింపచేయడానికి వారికి ప్రత్యేకమైన పత్రికలు ఎంతైనా అవసరం. తెలుగులో పత్రికారచన ప్రారంభమైన వంద సంవత్సరాల తరువాత గాని పిల్లల పత్రికలు రాలేదు. దీన్ని బట్టి తెలుగులో పిల్లలు పత్రికలు చాలా ఆలస్యంగా వచ్చాయని చెప్పవచ్చు. చిన్న పిల్లలకు ప్రత్యేకమైన పత్రికలను వెలువరించడం అంత సులభమైన విషయం కాదు. భాష విషయంలో , శైలి విషయంలో రచయితలు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. అంటే రచయితలు పిల్లల కోసం తాము రాసే విషయాలను పిల్లల స్థాయికి దిగి వారి మనస్సులను అర్థంచేసుకొని అత్యంత సలభమైన భాషలో రాయాలి.పిల్లలకు అర్థం కాకుండా రాస్తే వాటి వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు.

పిల్లల కోసం ప్రత్యేక పత్రికలు తెలుగులో **1940** లో ప్రారంభించబడ్డాయి. అయితే అంతకుముందు కొన్ని పత్రికలు పిల్లల కోసం కొన్ని శీర్షికలను ప్రచురించాయి. **1875** లో ఎ.కృష్ణమాచార్యులుగారు ప్రారంభించిన జన వినోదిని పత్రిక కొంత బాల సాహిత్యాన్ని ప్రచురించింది. ఇది బాల సాహిత్యాన్ని ప్రచురించిన మొదటి పత్రిక. **1909** అక్టోబర్ మద్రాసు నుంచి క్రిస్టియన్ లిటర్ట్యూర్ సొసైటీవారు వివేకవతి అనే పత్రికను ప్రారంభించారు. ఇందులో పిల్లలను పెంచే విధానం, పరిశుభ్రత, పిల్లలకు అవసరమైన వివిధ రకాల వంటకాల తయారీ మొదలైనవి ప్రచురించారు. ఆ తరువాత **1918**లో దువ్వూరి జగన్నాథ శర్మ సంపాదకత్వంలో వచ్చిన బాల భారతి పత్రిక కేవలం స్త్రీలకు, పిల్లలకు సంగీతం నేర్పే అంశాలను ప్రచురించారు.దీని పేరు బాల భారతి అయినా ఇది పిల్లల పత్రిక కాదు. **1940** లో మేడిచర్ల ఆంజనేయమూర్తి గారు సంపాదకత్వంలో బాల కేసరి అనే పిల్లల పత్రిక విజయవాడ నుండి వెలువడింది. ఇది పూర్తిగా బాలల పత్రిక.అంటే తెలుగులో మొట్టమొదటి బాలల పత్రిక 'బాల కేసరి' అని చెప్పవచ్చు. **1945**లో న్యాపతి రాఘవరావు, కామేశ్వరమ్మ

దంపతులు బాలల కోసం ప్రత్యేకంగా బాల అనే పత్రికను స్థాపించారు. ఆకాశవాణిలో రేడియో అన్నయ్యలుగా ప్రసిద్ధి చెందిన ఈ దంపతులు స్థాపించిన ఈ పత్రిక బాలలను బాగా అలరించింది. పిల్లలను ఎంతగానో ఆకట్టుకుంది.ఈ పత్రికలో పిల్లలను ఆకట్టుకునే శీర్షికలు చాలా ఉన్నాయి. అంకెల తమాషాలు, అలుకు- చిటుకు, రాము-సోము, చిక్కు ప్రశ్నలు, అతుకుల బొంత కథలు, గొలుసు మాటలు, సెలవుల్లో సరదాలు, అక్కయ్యతో ఐదు నిముషాలు బాలానందం, పొడపు కథలు, సామెతలు మొదలైన శీర్షికలతో అనేక రచనలు ఈ పత్రికలో ఉండేవి. ఇందులో ఒక్కోసారి కొన్ని చిన్న చిన్న

గేయాలు కూడా ప్రచురించబడ్డాయి. **1945** సంవత్సరంలోనే జనవినోదిని అనేపేరుతో మద్రాస్ నుంచి బాలల కోసం ప్రత్యేకంగా మరో పత్రిక ఆవిర్భవించింది. పిల్లలు పాడుకోవడానికి వీలుగా చిన్న చిన్న పాటలు, పద్యాలు, చెప్పుకోవడానికి చిన్న చిన్న కథలు ఇందులో ప్రచురించబడ్డాయి. దీన్ని వి.కృష్ణమాచార్యుల గారు ప్రచురించారు.

ఆ తరువాత పిల్లల కోసం ప్రత్యేకంగా ప్రారంభించబడిన పత్రిక చందమామ. దీన్ని నాగిరెడ్డి, చక్రపాణి గర్లు **1947** జూలై నెలలో మద్రాసులో ప్రారంభించారు. ఇందులో బాలలకు ఇష్టమైన అనే అంశాలు ఉన్నాయి. ప్రారంభించిన నాటి నుంచి నేటివరకు ఈ పత్రిక వస్తూనే ఉంది. ఆ తరువాత బాలమిత్ర, బొమ్మరిల్లు, బాబు, బాల బంధు, బాల వినోదిని, బాల భారతి, చంపక్ మొదలైన పత్రికలు వచ్చాయి, వీటిలో బాలకు అవసరమైన నీతి కథలు, బుద్ధి కౌశలానికి, సాహసాలకు , అద్భుతాలకు సంబంధంచిన కథలు ప్రచురింపబడ్డాయి.పై పత్రికలో బాలమిత్ర, బొమ్మరిల్లు, బాలబందు, బాలవినోదని, బాలజ్యోతి మొదలైనవి ఈనాడు రావడం లేదు. ఆగిపోయాయి.

**1947** జూలై నెలలో ప్రారంభించబడి నేటీ వరకు వస్తున్న ఏకైక పత్రిక చందమామ. చందమామ పత్రిక తెలుగు, తమిళ భాషలో ప్రారంభించబడి భారతరాజ్యాంగ గుర్తించిన అన్ని భాషల్లోను మాత్రమే కాకుండా అంతర్జాతీయ భాష అయిన ఇంగ్లీష్‌లో కూడా నేడు వెలువడుతుంది. చందమామ పిల్లల కోసం ఉద్దేశించినప్పటికి పెద్దలు కూడా ఆ పత్రికను ఎంతో ఆసక్తితో చదువుతున్నారు.

భారతదేశంలో చందమామ పత్రిక పేరు వినని వారుండరని చెప్పడం అతిశయోక్తి కాదు. ఇంత ప్రసిద్ధి, ఇంతటి ఆదరణ భారతదేశంలో మరే పత్రికకు ఉండదు. ఈ ప్రసిద్ధి ఈ పత్రికకు అంత సులభంగా రాలేదు. ఎన్నో పరీక్షలకు, శ్రమలకు ఓర్చుకొని ప్రారంభించబడినప్పటి నుంచి నిరంతరాయంగా పత్రిక వస్తూ ఉండడం వల్ల ఈ ప్రసిద్ధి లభించింది. భారతదేశం భిన్నత్వం కలిగిన దేశం. ఇందులో అనేక మతాలు, రాష్ట్రాలు, జాతులు, వారి ప్రత్యేకమైన ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాలు మొదలైనవి ఉన్నాయి. ఇంత భిన్నత్వం గల దేశంలో అన్ని మతాలకు, అన్ని రాష్ట్రాలవారికి, అన్ని జాతుల వారికి, అన్ని భాషలవారికి నచ్చేలా పత్రికను రూపొందించడం మాటలతో అయ్యే పని కాదు. అందుకు ఎంతో శ్రమ కావాలి. ఆ భిన్న జాతుల వారికి తమ తమ సంప్రదాయాలు, ఆచారాలు, అలవాట్లతో కూడిన కథలను తెలిపేవిగా పత్రికను చూడగానే ఇది మా పత్రిక అనిపించేలా పత్రికను రూపొందించాలి. ఇలా అందరికీ నచ్చేలా ఒక పత్రికను తయారు చేయడం సులభసాధ్యమైన విషయం కాదని చాలా కష్టమైన విషయమని సులభంగా అర్థమౌతుంది. చందమామ పత్రిక ఆ కష్టసాధ్యమైన విషయాన్ని సాధించి భారత దేశంలో ఉన్న ప్రజలందరూ ఇది మంచి పత్రిక, మా పత్రిక అని అనిపించుకునేలా తయారై దేశ ప్రజలందరి మన్ననలు పొందుతూ నడుస్తూ ఉంది. ఇందుకు ప్రధాన

కారణం చందమామ పత్రిక స్వరూప స్వభావాలు ఒక కారణం కాగా భారతదేశంలో భిన్నత్వంతో పాటు ఏకత్వం ఉండడం మరొక కారణం. భారతదేశంలో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం, ఏ ఏ భాషకు ఆ భాష, ఏ జాతికి ఆ జాతి కొన్ని ప్రత్యేకతలు కలిగి ఉన్నప్పటికీ వీటిన్నింటి భారత జాతీయత అనే ఏక మాత్రం సూత్రం కలుపుతూ ఉంది. చందమామ వ్యవస్థాపకులైన చక్రపాణి, నాగిరెడ్డి గార్లు ఈ విషయం బాగా తెలిసినవారు. వారికి భారతదేశం పట్ల అందులోని భిన్నత్వం పట్ల భిన్నత్వంలో ఏకత్వం పట్ల స్పష్టమైన అవగాహన ఉంది. అంతే కాకుండా వారికి నా కులం, నా మతం, నాజాతి, నా భాష, నా రాష్ట్రం అనే సంకుచిత ధోరణి లేదు. భారతదేశంమంతా ఒక్కటే, నేను భారతీయుడ్ని అనే విశాలమైన దృక్పథం వారిద్దరికీ ఉంది. అంతేకాకుండా ఈ దేశాన్ని ఏకం చేస్తున్న అనేక పురణాలు, ఇతిహాసాలు, జానపద కథలు మొదలైన వాటి పట్ల వారికి స్పష్టమైన అవగాహన ఉంది. భారతదేశంలోని ప్రజల భిన్న మనస్తత్వాలు వారికి బాగా తెలుసు. ప్రపంచలోని ప్రసిద్ధి పొందిన ఇతహాసాల పట్ల వారికి సద్భావం ఉంది. అందుకని ఆ మంచిని తమ పత్రిక ద్వారా తమ దేశ ప్రజలకు తెలియజేయాలనే సంకల్పం ఉంది. ఇన్ని గొప్ప విషయాలు, మహెూత్తర ఆశయాలు ఉన్న చక్రపాణి, నాగిరెడ్డి గార్లు ఈ ప్రతిక వ్యవస్థాపకులు కావడం ఆ పత్రిక చేసుకున్న సుకృతం. వారి ద్వారా ఆ పత్రిక భారతదేశమంతటా ప్రసద్ధి పొందింది. అలాగే ఆ పత్రిక ద్వారా చక్రపాణి, నాగిరెడ్డి గార్లు పత్రికతో సమానంగా ఖ్యాతిని ఆర్జించారు.

చందమామ పత్రిక స్థాఫించిన నాటికి తెలుగులోను ఇతర భారతీయ భాషల్లోను కొన్ని పిల్లల పత్రికలు ఉన్నాయి. చక్రపాణిగారు వాటిని అనుసరించకుండా తమకు నచ్చిన పద్ధతిలో ఎంతో కాలంగా తాము వేసుకున్న ప్రణాళిక ప్రకారం పత్రికను రూపొందించారు. ఈ పత్రికలో పిల్లలకు పనికొచ్చేవి ఎక్కువగా ఉన్న వాస్తవం. అంతే కాదు చక్రపాణి గారు ప్రత్యేకంగా పిల్లలు కోసమే చందమామ అనే పేరుతో దీన్ని స్థాపించారు. అయితే పత్రిక స్థాపించబడి ప్రజల చేతుల్లోకి వచ్చిన తరువాత పిల్లలతో పాటు పెద్దలను కూడా ఇది విశేషంగా ఆకర్షించింది. అందువల్లే విశ్వనాథ సత్యనారాయణగారు చందమామను ఆ బాలగోపాలాన్ని అలరించే పత్రికని అన్నారు. ఇలా ఆ బాల గోపాలాన్ని అలరించాలంటే పత్రికలో ఉన్న విషయాలు చాలా వైవిధ్యభరితమైనవిగా ఉండాలి. అంత వైవిధ్యభరితంగా చందమామ పత్రిక సంచిక తయారు కావడం చేతనే ఈ పత్రిక ఆ బాల గోపాలాన్ని అలరిస్తూ ఉంది.

పిల్లలకు కథలంటే చాలా ఇష్టం. కథలు చెప్పమని పిల్లలు పెద్దలను పోరు పెడుతుంటారు . ఆ కథలు ప్రధానంగా భారత రామాయాణాది పురాణాలకు సంబంధించినవి, మాయలు మంత్రాలు మొదలైన వాటితో కూడుకున్న అద్భుతమైనవి, సింహాలు, తోడేళ్ళు, నక్కలు మొదలైన జంతువులకు సంబంధించినవి, డేగ, పావురం, పిట్ట మొదలైన పక్షులకు సంబంధించినవి అయితే పిల్లలు బాగా ఇష్టపడతారు. సాంప్రదాయకంగా వచ్చే జానపద కథలు ఎక్కువగా ఇలాంటివే ఉన్నాయి. ఇలాంటి కథలను చెబితే పిల్లలు నిద్రాహారాలు మానివేసి మరీ వింటుంటారు. చందమామ సంపాదకులైన చక్రపాణి, నాగిరెడ్డి గార్లకు పిల్లల మనస్తత్వం బాగా తెలుసు, అందువల్లే పిల్లల కోసం తాము స్థాపించిన చందమామ పత్రికలో కథలకు పెద్ద పీఠ వేశారు. కథల్లో వైవిధ్యం లేకుండా ఒకే రకమైన కథలుంటే కొంత విసుగు పుట్టే అవకాశం ఉంది. అందువల్ల చందమామ పత్రికలోని కథలన్నీ ఒకే పరిమాణం కలిగినవి కావు. ఈ పత్రికలో చిన్నకథలు, పెద్ద కథలు, ధారావాహిక కథలు, గేయ కథలు అని

ప్రధానంగా నాలుగు విభాగాలుగా ఉన్నాయి. వీటిలో ఒకటి నుంచి మూడు పుటల వరకు నిడివి కలిగి ఉన్నవి చిన్న కథలు. నాలుగు నుంచి ఆ పైన నిడివి కలిగినవి పెద్ద కథలు. కథల్లో కొన్ని చాలా పెద్దవిగా ఉండి అనేక రకాల మలుపులు తిరుగుతూ సంక్లిష్టంగా ఉన్నావి కొన్ని ఉంటాయి. ఇలాంటవన్నీ ఒకే సంచికలో ప్రచురించడం సాధ్యం కాదు. అందువల్ల వాటిని చాలా సంచికల్లో ధారావాహికంగా ప్రచురించవలసి ఉంటుంది. ఈ కారణం చేతనే చందమామ పత్రికలో అనేక ధారావాహిక కథలు ఉన్నాయి. వీటితో పాటు ఒకటి రెండు పుటల్లో కొన్ని గేయకథలు కూడా చందమామలో ఉన్నాయి. ఇవే కాకుండా చిత్ర కథలు, అట్ట మీద బొమ్మ కథలు, అట్ట వెనకు బొమ్మ కథలు మొదలైన అనేక రకాలకు చెందిన కథలు చందమామలో ఉన్నాయి. ఇతవృత్తం దృష్ట్యా ఈ కథలు చాలా వైవిధ్యభరితంగా ఉన్నాయి. ఇందులో ప్రాణికథలు, నీతికథలు, తెలివితేటలకు సంబంధించిన కథలు, మనస్తత్వ నిరూపక కథలు, దెబ్బకు దెబ్బతీసే కథలు, ప్రవక్తలకు సంబంధించిన కథలు ధర్మ నిర్ణయానికి సంబంధించిన కథలు, న్యాయ నిర్ణయానికి సంబంధించిన కథలు, భక్తుల కథలు, అద్భుత కథలు, గర్వ కథలు, పౌరాణిక కథలు, చారిత్రక కథలు మొదలైన అనేక విషయాలకు సంబంధించిన కథలు చందమామ పత్రికలో ప్రచురించబడ్డాయి. చందమామ పత్రిక ప్రతి సంచికలోని కథలన్నీ దాదాపు ఏ రెండు కథలూ ఒకే విధంగా ఉండకుండా అన్ని కథలు ఎంతో వైవిధ్యభరితమైనవిగా ప్రత్యేకమైన విషయాన్ని వివరించేవిగా ఉంటాయి. పై కథల్లో పౌరాణిక కథలు రామాయణ, భారత, భాగవతాలకు సంబంధించినవి మాత్రమే కాకుండా ఇంకా అష్టాదశ పురాణాలకు, అష్టాదశ ఉప పురాణలకు సంబంధించిన ఎన్నో కథలు చందమామ పత్రికలో చిన్న కథలుగా, పెద్ద కథలుగా , ధారవాహిక కథలుగా ప్రచురించబడ్డాయి. భారతదేశంలో అనేక మతాల వారు ఉన్నారు. ఈ మతాలకు ప్రవక్తలు ఉన్నారు. ప్రవక్తలకు సంబంధించిన చాలా కథలు ప్రచారంలో ఉన్నాయి. వీటిలో జైనా, బౌద్ధ మతాలకు చెందిన ప్రవక్తలు, హిందూ మతానికి చెందిన ప్రవక్తలు, సిక్కు మతానికి, మహ్మదీయ,క్రైస్తవ మతాలకు చెందిన ప్రవక్తల కథలు ఉన్నాయి. చందమామ పత్రికలో ఈ ప్రవక్తలకు చెందిన కథలు చాలా ప్రచురించపడ్డాయి. ఈ కథలు ఆ ప్రవక్తల మహాత్మ్యాన్ని, ఆ మాతాల్లోని మానవతా ధర్మాన్ని. మతాత్వాల్ని తెలిపేవిగా ఉన్నాయి. దురాశ దు:ఖానికి చేటు, పెద్దలను గౌరవించాలి, తల్లిదండ్రులను వృద్ధాప్యంలో బాగా చూడాలి, బలవంతుడు బలహీనులను భాధపెట్టకూడదు మొదలైన అనేక నీతులకు సంబంధించి కథలు చందమామ ప్రచురించబడ్డాయి. భక్తుల కథల్లో మార్కండేయుడు, తుకారాం, వావదేవుడు మొదలైన హిందూ మత భక్తులతో పాటు అనేక మతాల్లో ప్రసిద్ధి చెందిన భక్తుల కథలు చందమామలో ప్రచురించబడ్డాయి. ప్రాణి కథల్లో సింహం. పులి, ఏనుగు, కాకా, దేగ,పిట్టి మొదలైన అనేక రకాల పశుపక్ష్యాదులకు చెందిన కథలు చందమామ పత్రికలో ప్రచురించపడ్డాయి. కవుల కథల్లో కాళిదాసు, గుణాద్యుడు, శూద్రకుడు, తెనాలి రామకృష్ణుడు, ఫిరదౌశి, వేమన మొదమైన అనేక మంది కవులకు చెందిన కథలు ఈ పత్రికలో ప్రచురించబడ్డాయి. చారిత్రక కథల్లో ఆంధ్రదేశ చరిత్రకు, రాజస్థాన్ చరిత్రకు తమిళ, కర్ణాటక మొదలైన అనేక రాష్ట్రాలకు సంబంధించిన చారిత్రక కథలు ఇందులో ఉన్నాయి. భారత దేశంలో సోమనాథ దేవాలయం, ఖజురహో దేవాలయం, మీనాక్షి దేవాలయం, తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర దేవాలయం, కోణార్క సూర్యదేవాలయం మొదలైన ప్రపంచ ప్రసిద్ధి చెందిన దేవాలయాలు ఉన్నాయి. ఈ దేవాలయ నిర్మాణానికి సంబంధించిన అనేక రకాల స్థల పురాణాలు ప్రజల్లో ప్రచారంలో

ఉన్నాయి. చాలా మంది రచయితలు ఈ కథలను సేకరించి చందమామలో ప్రచురించారు.

అద్భుత కథల్లో అనేక రకాల మాయలు, మంత్రాలు, మంత్రాల దీవులు, అద్భుత సౌధాలు మొదలైనవి అద్భుత ప్రపంచంలో విహరింప చేసే కొన్ని వందల కథల చందమామ పత్రాకలో ప్రచురించబడ్డాయి. తోక చుక్క,మరక దేవత, ముగ్గురు మాంత్రికులు, జ్వాలాద్వీపం, రాకాసిలోయ, పాతాళదుర్గం, శిధిలాలయం, రాతిరథం, యక్షపర్వం , మాయసరోవరం, భల్లూక యాంత్రికుడు మొదలైన ధారావాహిక కథలు ఇలాంటివి. ఈ కథలు భారత దేశమంతటా పాఠకులకు ఎంతగానో ఆకర్షించాయి. అలాగే తెలివితేటలగు సంబంధించిన కథలు.ధర్మ నిర్ణయానికి సంబంధించిన కథలు,త్యాగానికి, గర్వ భంగానికి సంబందించిన కథలు, తత్వవేత్తలు కథలు, బలవంతుల కథలు మొదలైన వాట్టిల్లో కూడా అనేక రకాల ఉన్నాయి. ఈ కథలే కాకుండా జాతక కథలు, బేతాల కథలు మొదలైనవి చందమామ పత్రికలో ధారావాహికంగా ప్రచరించబడ్డాయి. వీటితో పాటు చైనా, టిబెట్, నేపాల్, జాపాన్ మొదలైన దేశాలకు చెందిన ప్రసిద్ధమైన కథలు చందమామలో ప్రచురించబడ్డాయి. ఈ విధంగా ఇంత వైవిధ్యభరితమైన కథల ప్రపంచాన్ని చందమామ పత్రిక తప్ప మరే పత్రిక ప్రచురించలేదు. ఈకథలను సేకరించడంలో వాటిని చందమామ పత్రికలో ప్రచురంచడానికి అనుగుణంగా తీర్చదిద్దడంలో పత్రిక సంపాదక వర్గం ఎంతగానో శ్రమించింది. పైన చెప్పిన కథలన్నీ భారతదేశంలోని పాఠకులను ఎంతగానో ఆకర్షించి చందమామ ప్రసిద్ధికి దోహదం చేశాయి.

చందమామ పత్రికలో పైన చెప్పిన కథ లేకుండా బాలలకు,పెద్దలకు ఆసక్తిని కలిగించే విజ్ఞానాంశాలు, వినోదాంశాలు ప్రతి సంచికలోను ప్రచురింపబడుతున్నాయి. వీటిలో వార్తలు – విశేషాలు, చెప్పుకోగలవా, బదులు చెప్పు, భూగోళ వృత్తాంతం నీకు ఏ పాటి తెలుసు, తాతయ్య కబుర్లు,పువ్వులలో వాసన ఎక్కడ నుంచి వస్తుంది, సులువైన కసరత్తు, మహోత్సవం, ప్రపంచంలోకెల్లా పెద్ద పువ్వు, బుడగ ఎలా ఏర్పడుతుంది, ఎంత వడిగా నడవగలవు, పులుల తమాషాలు,మలుపు తిరిగినా రైలు బండి పట్టాలు తప్పదు ఎందుచేత, రంగులు మార్చే ఊసరవెల్లి, ప్రకృతిలో వెలుగు, మోటార్ కార్ల తమాషా మొదలైన అనేక రకాల శీర్షికలతో ప్రపంచంలోని వింతలు విశేషాలతో కూడిన సైన్స్, చరిత్ర,భూగోళం, లెక్కలు మొదలైన అనేక విషయాలకు సంబంధించి విజ్ఞానాంశాలను చందమామ పత్రిక ప్రచురించింది .ఇవన్నీ పాఠకులకు చాలా వరకు అంతకు ముందు తెలియవు. తమకు తెలియని కొత్త విషయాలను పత్రిక చెబుతూ ఉండడం వల్ల కొంత మంది పాఠకులకు ఇలాంటి విషయాలు తెలుసుకోవడానికి చందమామ పత్రికను తెప్పించుకునేవారు.అలాగే ఇంద్రజాలం, ఒంటిగీత బొమ్మ, అనేక రకాల పజిల్స్, ఫోటో వ్యాఖ్యాల ఫోటీ, బొమ్మల్లో చిత్రకారుడు వేసి తప్పులను గుర్తించడం మొదలైన అనేక శీర్షికలతో పత్రికలో వినోదానికి సంబందించిన విషయాలు ప్రచురించబడ్డాయి. వీటిలో కొన్ని పాఠకుల మెదడుకు మేతలా పని చేశాయి, కొన్ని పాఠకులకు భాషాభివృద్ధిని కలిగిస్తాయి. ఈ విధంగా చందమామ పత్రిక అనేక వైవిధ్యభరితమైన విశేషాలతో పాఠకులను ఆకట్టుకుంటూ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు కొనసాగుతూనే ఉంది.

భారత దేశంలో చాలా పత్రికలు ఎంత ప్రసిద్ధి చెందినప్పటికీ అవి ఒక రాష్ట్రానికో లేదా రెండు రాష్ట్రాలకో పరిమితమైనవిగా ఉన్నాయి. భారతదేశంలో భారత రాజ్యాంగం గుర్తించిన అన్ని భాషాల్లోను వస్తున్న పత్రిక చందమామ తప్ప మరొకటి లేదు.ఈ పత్రిక మొదట

తెలుగు, తమిళ భాషాల్లో ఆ తరువాత కన్నడ, గుజరాతీ హిందీ, మరాఠీ మొదలైన భారతీయ భాషల్లో ప్రచురింపబడింది. వీటిలో పాటు అంతర్జాతీయ భాష అయిన ఇంగ్లీష్ భాషలో కూడా ప్రచురింపబడుతూ ఉంది. విదేశాల్లో ఉన్న భారతీయల కోసం చందమామ పత్రిక ద్విభాషల్లో కూడా ప్రచురింపబడుతుంది. ఇది ఇంగ్లీష్-తెలుగు, ఇంగ్లీష్ - హిందీ, ఇంగ్లీష్ -గుజరాతీ, ఇంగ్లీష్- తమిళం మొదలైన విధంగా ఈ పత్రిక ప్రచురించబడుతూ ఉంది. ఈ విధంగా ఇంత వైవిద్యభరితమైన ప్రచురణలతో వచ్చిన పత్రిక చందమామ తప్ప మరొకటి లేదు. పైన చెప్పన విశేషాంశాలతో , ప్రత్యేకతలతో కూడిన చందమామ పత్రిక అపూర్వమైన, అద్భుతమైన పత్రికగా భావించవచ్చు. ఇలాంటి పత్రిక భారతదేశంలో మరొకటి లేదు.

ఉపయుక్త గ్రంథసూచి:-

1. వార్తా రచన  వ్యవహారాలు- గజ్జా యోహన్ బాబు.
2. చక్రపాణి విజయ పతాక, - డా.వెలగా వెంకటప్పయ్య
సాహిత్య అకాడమి, బెంగళూరు.
3. ఆంధ్రుల చరిత్ర సంస్కృతి, - ఖండవల్లి లక్ష్మిరంజనం,
బాలసరస్వతి బుక్‌డిపో, మద్రాసు.
4. బాల సాహితీ వికాసం -డా. వెంగా వెంకటప్పయ్య
5. బాల సాహిత్యం - డా. యం. దేవకి.
6. పిల్లల పాటలు - చిలుకూరి నారాయణరావు.
సాధన ప్రింటర్స్, అనంతపురం

డా.యం.గిరిబాబు